సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



కోలాటం కర్రలు అందుకున్న చిన్నారులతో శ్రీలక్ష్మియాదవ్

మల్కాపురం: 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి ప్రాంతానికి చెందిన జై కృష్ణ కోలాటం గ్రూప్ చిన్నారులకు అవసరమైన కోలాటం స్టిక్స్(కర్రలు)ను స్థానిక మహిళా నాయకురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మియాదవ్ అందించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో చిన్నారులు ఆదివారం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. దీన్ని చూసిన శ్రీలక్ష్మియాదవ్ తన వంతుగా వారికి అవసరమైన స్టిక్స్‌ను వితరణగా అందించారు. కార్యక్రమంలో జై శ్రీకృష్ణ కోలాట గురువు నూనెల లావణ్యయాదవ్, ఉరుకూటి పైడిరాజు(పెంటా) తదితరులు పాల్గొన్నారు.

మాధవుని సన్నిధిలో వైభవంగా పూజలు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మర్రిపాలెం: ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీ లీలా మాధవస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం రెండో ఆదివారం మాఘమాస వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయంలో అర్చకులు పూజలు చేశారు. జలధార వద్ద భక్తులు పుణ్య స్నానమాచరించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదం స్వీకరించారు. కంచరపాలెం సీఐ రవికుమార్, ఎస్.రవికుమార్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సనపల బంగార్రాజు అన్నదానం ప్రారంభించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మత సామరస్యమే శాంతికి మార్గం



మాట్లాడుతున్న రామకృష్ణ శాఖానంద స్వామి

సీతంపేట : మత సామరస్యమే శాంతికి మార్గమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో మత సమైక్యత - ప్రపంచ శాంతి వారోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణా ఆశ్రమం స్వామి కృష్ణ శాఖానంద మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలు యుద్ధాలతో సతమతమవుతూ శాంతిని కోల్పోతున్నాయని తెలిపారు. మత సామరస్యం కాపాడుకోవాల్సిన బాధ్యత అందిరిపైనా ఉందన్నారు. ఐక్యరాజ్య సమితి శాంతి కోసం కృషి చెయ్యాలని, శాంతి స్థాపనకు మత సామరస్యం దోహదపడుతుందన్నారు. సమావేశంలో సంస్థ ఛైర్మన్ నరవ ప్రకాశరావు, కె.ఎస్.ఎన్.మూర్తి, ఎల్.ప్రజ్ఞాన్, రామేశ్వరి, అబ్దుల్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం



మాట్లాడుతున్న ఉదయ్‌భాస్కర్

సీతంపేట : సమాజంలో కుల మతోన్మాదానికి వ్యతిరేకంగా డాక్టర్ జయగోపాల్ ఉద్యమించడమే కాకుండా అనేక రచనలు చేశారని ఉదయ భాస్కర్ అన్నారు. పెరియార్ అవార్డు గ్రహీత డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి సభ భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయగోపాల్ పుస్తకాలతోపాటు సీవీ రచనలను కూడా ప్రమోట్ చేసేవారని గుర్తు చేశారు. జయగోపాల్ ఆశయ సాధనకు ఆయన సతీమణి శారద ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ మూఢ నమ్మకాల పట్ల ప్రజలను జాగృతం చెయ్యడంలో జయగోపాల్ పాత్ర అనిర్వచనీయమన్నారు. రవి, సాయి నరేందర్, వేదాంత మౌర్య, వై.నూకరాజు, కొత్తపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.



అల్యూఫ్లోరైడ్ నుంచి వస్తున్న దట్టమైన నల్లని పొగ

ములగాడ గ్రామం.. నగరవాసులు సూర్యోదయాన్ని చూసిన కాసేపటికి గానీ ఇక్కడి వారికి భానుడి వెలుగులు సోకవు. స్థానిక పరిశ్రమల నుంచి వచ్చే పొగను చీల్చుకుని సూర్యకిరణాలు గ్రామాన్ని తాకేందుకు వీల్లేని పరిస్థితి. వేకువజామున స్నానం చేసి బయట ఓ గంటసేపు కూర్చుంటే.. బొగ్గు గనుల్లో పని చేసి వచ్చిన కార్మికుల్లా తయారవుతాం. రాత్రుళ్లు, తొలివేకువ సమయాల్లో విడిచిపెట్టే పరిశ్రమ వ్యర్థాలు గాల్లో కలిసి, ఇక్కడి ప్రజల జీవితాలను నరకం చేస్తున్నాయి. అడపాదడపా వైద్య శిబిరాలు నిర్వహించడం మినహా.. కాలుష్య నియంత్రణ చర్యల వైపు దృష్టిసారించట్లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

కాలుష్య కోరల్లో.. ఉక్కిరిబిక్కిరి



ములగాడ నివాసాల్లో ఎక్కడ చేయేసినా..



మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శివారు ప్రాంతంలో ఉన్న చిన్న ములగాడ గ్రామంలో సుమారు 1500 మంది నివాసం ఉంటున్నారు. వీరిలో అత్యధిక మంది రోజు కూలీలే. ఏరోజుకారోజు పనులు వెతుక్కుంటే తప్ప బతుకులు గడవనివారే. ఇలాంటి వారికి తరచూ అనారోగ్య సమస్యలు వస్తే పరిస్థితి ఎంత దుర్భరమో.. ఆలోచించేందుకే భయపడాల్సిన పరిస్థితి. గ్రామానికి అతి చేరువలో ఉన్న అలూఫ్లోరైడ్ పరిశ్రమ వల్ల తమ బతుకులు నరకంగా మారాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ పరిశ్రమ పొగ గొట్టాల నుంచి దట్టమైన నల్లని, తెల్లని పొగలు తరచూ వెలువడుతున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు చెప్తున్నారు.

బయటకు రావాలంటే భయం

రోజూ అర్ధరాత్రుళ్లు, కొన్నిసార్లు సాయంత్రాలు, వర్షాలు కురిసే సమయంలోనైతే టైంతో పనిలేకుండానే పరిశ్రమ పొగ గొట్టాల ద్వారా రసాయన వ్యర్థ వాయువుల్ని గాలికి వదిలేస్తుంటారు. గాలి వాటానికి ఈ నల్లని పొగ చిన్నములగాడ గ్రామంపైకి వచ్చి ఆ గ్రామం అంతా నల్లటి ధూళి పేరుకుపోతోంది. ఆ సమయంలో బయట సంచరించే ప్రజల్లో కళ్ల మంటలు, గొంతు నొప్పి, పొడి దగ్గు వంటి సమస్యలు నెలకొంటున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తెల్లటి పొగ వస్తున్న సమయంలోనైతే ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా ఉంటోందని వాపోతున్నారు. దీంతో పొగ వదిలే సమయంలో బయటకు రావాలంటే భయపడే పరిస్థితి. దీంతో చాలా వరకు ఆ సమయాల్లో తలుపులు బిగించుకుని ఇళ్లకే పరిమితమవ్వాల్సిన పరిస్థితి.



పరిశ్రమ నుంచి విడుదలవుతున్న వ్యర్థ రసాయన వాయువులు

మొర వినిపించుకునేవారేరీ?

ఈ కాలుష్య సమస్యను పరిశ్రమ ప్రతినిధులకు మొరపెట్టుకునేందుకు ఎప్పుడు వెళ్లినా.. వారు అందుబాటులోకి రావటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మూడు నెలల నుంచి ఈ సమస్య మరింతగా పెరిగింది. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పాలకులు స్పందించి, కాలుష్య సమస్య నుంచి విముక్తి కలిగించాలని ప్రజలు పదేపదే వేడుకుంటున్నారు. ఈ గ్రామానికి అనుకుని ఉన్న కోరమాండల్ పరిశ్రమ నుంచి కూడా ఇలాంటి సమస్యే తమను వేధిస్తోందని గ్రామస్తులు చెప్తున్నారు. దీనిపై కోరమాండల్ అధికారులతో మాట్లాడితే.. ఓ వైద్య శిబిరం నిర్వహించి, చేతులు దులిపేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలూఫ్లోరైడ్ సంస్థ అయితే ఇంత వరకు బాధిత గ్రామ ప్రజల వేపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ సమస్యపై అలూఫ్లోరైడ్ పరిశ్రమ ప్రతినిధులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

చాలా ఇబ్బందిగా ఉంది



అలూ ఫ్లోరైడ్ సంస్థ వల్ల మా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నల్లటి పొగ గ్రామాన్ని చుట్టుముట్టి, ప్రతి ఇంట్లో చేరుతోంది. దాన్ని ఊడ్చేందుకే ఆడవాళ్లకు సరిపోతోంది. ఈ పొగతోపాటు వచ్చే ధూళి కణాల వల్ల కళ్ల మంటలు, గొంతు నొప్పి లాంటి బాధలు పడాల్సి వస్తోంది. గ్రామ పెద్దగా ఆ సంస్థ అధికారులతో మాట్లాడేందుకు వెళ్తే అందుబాటులోకి రావట్లేదు.

–సీరపు నర్సింగరావు, గ్రామపెద్ద, చిన్న ములగాడ

ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి



మా గ్రామాన్ని ఆనుకుని ఉన్న పరిశ్రమలు విడుదల చేస్తున్న పొగ వల్ల మా జీవితాలు నిత్యం నరకంగా మారుతున్నాయి. తరచూ అనారోగ్య సమస్యలకు గురవుతున్నాం. చాలాసార్లు ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారుతోంది. ఎంత మందికి మొరపెట్టుకున్నా.. పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా అధికారులు మా బతుకులపై దృష్టిసారించి, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలి.

– సుజాత, స్థానికురాలు, చిన్న ములగాడ

రేపు పైడితల్లి తీర్థమహోత్సవం

- బుచ్చిరాజుపాలెం గ్రామదేవత పైడితల్లి అమ్మవారు
- తీర్థ మహోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు
- వైభవంగా పైడితల్లి అమ్మవారి నేత్ర దర్శనం



పైడి తల్లి అమ్మవారు



పెయింటర్‌ను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం గ్రామదేవత శ్రీ పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 11(మంగళవారం)న అంగరంగ వైభవంగా జరిపించేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయం ఉన్నప్పటికీ.. ఏటా నిర్వహించే పండగలో గ్రామ పెద్దలు సైతం స్వచ్ఛందంగా భాగస్వాములై ఉత్సవాన్ని సందడిగా జరిపిస్తారు. అమ్మవారు గ్రామ దేవత కావటంతో బుచ్చిరాజుపాలెంతో పాటు, చుట్టుపక్కల కాలనీల నుంచి కూడా పండగ రోజున అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో మూర్తి, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో ఆదివారం సమావేశమై చర్చించారు. గోపాలపట్నం-ఎన్ఏడీ బీఆర్‌టీఎస్ రోడ్‌కు ఆనుకుని ఉండటంతో పండగ రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ఆలయ పరిసరాల్లో గ్రామ పెద్దలతో కలిసి పర్యటించి, పలు సూచనలు చేశారు.

వేడుకగా నేత్ర దర్శనం:
పండగ నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవంలో భాగంగా ఆదివారం నేత్ర దర్శనం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారి విగ్రహానికి పెయింటింగ్ వేసిన ఉల్లూరి పరమేశ్వర్‌ను గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పురెడ్డి ప్రకాష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు పది వేల పెన్నులతో పూజ



ఎర్నిమాంబ అమ్మవారి పాదాల వద్ద ఉంచిన పది వేల పెన్నులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలిసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ద్వాదశి, మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న పోటీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని, ఎర్నిమాంబ అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని దైవ సన్నిధిలో దశ సహస్ర (10 వేలు) కలములతో విశేష పూజలు నిర్వహించినట్లు ఈవో సురేష్‌బాబు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అమ్మవారి పేరుతో ముద్రించిన పెన్నులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రత్యేక ఉచిత దర్శనాలకు అనుమతించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో మూడు పీఠాల పండగ



మూడు పీఠాలతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం



దివ్య ప్రసాదం అందిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతులు ఆర్చి బిషప్ పొలిమేర జయరావ్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం మూడు పీఠాల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ అగ్రపీఠం ప్రత్యేక పరిపాలనాధికారి (ఆర్చి బిషప్) డాక్టర్ పొలిమేర జయరావ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు ప్రభువు ఇహలోకం నుంచి పరలోకానికి వెళ్లే సమయంలో తాను మానవళి మధ్యలో సజీవంగా ఉండేందుకు గుర్తుగా రొట్టె, ద్రాక్షరసాన్ని ఆశీర్వదించి భుజించమని చెప్పారన్నారు. దివ్య పూజబలిలో సత్ప్రసాదంలోని సాక్షాత్తు క్రీస్తు ప్రభు అంశ ఉంటుందన్నారు. పండగలో భాగంగా సుమారు 120 మంది చిన్నారులు నూతనంగా దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం సాయంత్రం జ్ఞానాపురంలోని వడిచర్లవీధి, స్లీప్‌గుర్తు మండపంలో, పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఏర్పాటు చేసిన పీఠాల వద్ద దివ్య సత్ప్రసాద ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండగ వాతావరణంతో పవిత్ర హృదయంతో జరిగిన పాదయాత్రలో నగరం నలుమూలల నుంచి అనేక మంది క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశాఖ అర్చి ప్రత్యేక పాలనాధికారి బిషప్ పొలిమేర జయరావ్ మాట్లాడుతూ వాటికన్ నుంచి పోప్ ఫ్రాన్సిస్ ద్వారా వచ్చిన వర్తమానాన్ని ఈ సందర్భంగా విశాఖ నూతన అగ్రపీఠం ఆర్చిబిషప్‌గా డాక్టర్ ఉడుముల బాల నియమితులైనట్లు జయరావ్ తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్, ఫాదర్ వినయ్‌కుమార్, ఫాదర్ వేళంగిణీ రాజు, సుమారు 150 మంది గురువులు, కన్య స్త్రీలు, ఆలిండియా కేథలిక్ యూనియన్ సభ్యులు, పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఫుట్‌పాత్‌లు



సుకన్య సినిమా హాలు వద్ద ఫుట్‌పాత్ దుస్థితి

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లు అధ్వానంగా మారాయి. చాలా చోట్ల ఫుట్‌పాత్ పైనున్న పలకలు సరిగా లేకపోవడం, మరి కొన్ని ఎగుడుదిగుడుగా ఉండటంతో నడిచేందుకు వీల్లేని పరిస్థితి. మరో వైపు వీటి నుంచి దుర్గంధం వ్యాపిస్తుండటంతో పాదచారులు రోడ్ల పైనుంచే నడవాల్సి వస్తోంది. ఫుట్‌పాత్‌లు వదిలి రోడ్లపై నడుస్తుండటంతో వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారి, ప్రమాదాలకు ఆస్కారమిచ్చేలా ఉంది. గోపాలపట్నం ప్రధాన రహదారి సుకన్య సినిమా హాల్ వద్ద ఫుట్‌పాత్ పూర్తిగా శిథిలమైంది. దీనిపై పలకలు చిందరవందరగా పడి ఉన్నాయి. దీనికి తోడు నిరుపయోగంగా ఉన్న దుకాణం వద్ద మందుబాబులకు నిలయమై, అక్కడే మూత్రవిసర్జనకు పాల్పడుతున్నారు. దీంతో పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు.


జేసీఐ వైజాగ్ స్మార్ట్ నూతన అధ్యక్షురాలిగా జియ్యాని కావ్య



జేసీ కావ్యను అభినందిస్తున్న నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి

అల్లిపురం: జేసీఐ వైజాగ్ స్మార్ట్ 2025 నూతన అధ్యక్షురాలిగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుమార్తె జేసీ కావ్య జియ్యానిని ఆ సంస్థ జిల్లా ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ప్రమాణస్వీకారం చేయించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో పాటు జేసీఐ ఎన్ఏడీ చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్ జయంత్ హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన జేసీ కావ్యను అభినందించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ జేసీఐ అనేది విద్యార్థి దశ నుంచి వృత్తిలో మంచి నైపుణ్యత కోసం శిక్షణలు, నాయకత్వ లక్షణాలు మెరుగుపరుచుకోవడానికి, వ్యాపారం, కమ్యూనిటీ వృద్ధి అవకాశాలను అందిస్తుందన్నారు. సునీత పోలిశెట్టి, జోన్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్, జోన్ వైస్ ప్రెసిడెంట్ జేసీ ఓబైద్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ చేస్తున్న పీఠం పురోహితులు

సీతంపేట : శ్రీలలితా పీఠం 76వ బ్రహ్మోత్సవాలు అంకురార్పరణతో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి సమక్షంలో కుర్తాళం పీఠం పురోహితులు మాచవోలు రమేష్ శర్మ వేదమంత్రాల మధ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి లలితా కామేశ్వరులకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు చేపడతామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అలాగే సాయంత్రం 6.30 గంటలకు లలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐ.సుబ్బరామనాయుడు, యశోదమ్మ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యకరం



సేంద్రియ ఆకు కూరల్ని చూపుతున్న సంరక్షిక సంస్థ అధ్యక్షురాలు షీలూ జైన్

మల్కాపురం: ఎరువులు, రసాయన క్రిమి సంహారక మందులు వినియోగించి పండించే పంటల కంటే.. సేంద్రియ పద్ధతిలో సాగు చేసే పంట ఉత్పత్తులే ఆరోగ్యకరమని సంరక్షిక సంస్థ అధ్యక్షురాలు షీలూ జైన్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల సేంద్రియ పంట ఉత్పత్తుల ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలే ఆరోగ్యకమని పేర్కొన్నారు. మారిన జీవన విధానంలో నగరాల్లో నివసిస్తున్నవారే కాకుండా ప్రతి ఒక్కరూ తమ ఇంటి అవరణలో గానీ, మేడ పైనున్న స్థలంలో, ఖాళీ స్థలాల్లో సొంతంగా ఆకు కూరలు, కూరగాయలు పండించుకుని, వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. పలువురికి బాపట్ల మిర్చి, దేశీయ టమాటా, బంతి తదితర నారు అందించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రిషాబ్, సంస్థ సభ్యులు రమాదేవి, సీఐఎస్ఎఫ్ సిబ్బంది కె.బాబు, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం షిప్‌యార్డ్ ఉద్యోగుల వినతి



ఎమ్మెల్యే గణబాబుతో షిప్‌యార్డ్ మాజీ ఉద్యోగుల సొసైటీ సభ్యులు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ మాజీ ఉద్యోగుల సొసైటీ సభ్యులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబును గోపాలపట్నంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి, తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. షిప్‌యార్డ్‌లో గత 40 ఏళ్లుగా వర్క్ ఆర్డర్స్ మీదే పనిచేస్తున్నామని, 271 కుటుంబాలు, 1200 మంది జనాభా షిప్‌యార్డ్‌లో జరిగే వర్క్ ఆర్డర్స్ మీదే ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం షిప్‌యార్డ్ యాజమాన్యం వర్క్ ఆర్డర్స్ ఇవ్వకుండా, కేవలం సర్వీస్ కాంట్రాక్ట్ మాత్రమే ఇస్తామని చెబుతున్నారని, అలాగైతే తమ బ్రతుకులు రోడ్డున పడతాయని వాపోయారు. దీనికి తాము అంగీకరించేది లేదని, ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనన్నారు. షిప్‌యార్డ్ యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే గణబాబు సొసైటీ సభ్యులతో మాట్లాడుతూ సోమవారం యాజమాన్యంతో చర్చించి, న్యాయం చేస్తానని చెప్పినట్లు షిప్‌యార్డ్ మాజీ ఉద్యోగుల సొసైటీ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వాలచే పని చేయించడమే మానవ హక్కుల కౌన్సిల్ కర్తవ్యం



మాట్లాడుతున్న మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్

డాబాగార్డెన్స్: ప్రజలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి సమస్యలు పరిష్కరించడమే మానవ హక్కుల కౌన్సిల్ కర్తవ్యమని కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్‌కి ఆదివారం నగరంలోని డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కులు ఏంటి? ఉల్లంఘిస్తే డిఫెండర్లుగా మనం ఏం చేయాలి? హ్యూమన్ రైట్స్ ఎలా ఉన్నాయి? తదితర చట్టాల గురించి పలువురు న్యాయకోవిదులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అసలు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎప్పుడు ప్రారంభమైంది? ఏ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రారంభించబడింది? అనే అంశాలపై డిఫెండర్స్‌కు వివరించారు. సీనియర్ అడ్వకేట్ ఐఎం అహ్మద్ మాట్లాడుతూ విశాఖ నగరంలో వేలాది మంది సీనియర్ సిటిజన్స్ ఉన్నారని, వారంతా మానవ హక్కులు కోల్పోతున్నారని, వాటిని తెలియజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్‌వీ రమణ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి గౌరవం, విలువ ఉంటాయని, ప్రతి వ్యక్తి ప్రాథమిక విలువను గుర్తించే మార్గాల్లో మానవ హక్కులు గుర్తించడం, గౌరవించడం ఒకటన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com